స్కెచ్

# గూటికి చేరిన పిట్టలు

ద్రోణంరాజు కృష్ణమోహన్

"నాన్నా..." వాకిట్లో తండ్రిని చూస్తూ పరుగెత్తుకొచ్చి కాళ్ళకి చుట్టేసుకున్నాడు ఆరేళ్ళ చిట్టి.

"రా... చిట్టీ" కొడుకు నెత్తుకుని గట్టిగా కావిలించుకుని ముద్దాడుతూ చాక్ లెట్ పొట్లం చేతిలో పెట్టాడు జానకిరామయ్య.

"చెల్లాయికేం తెచ్చావ్?" చిట్టి ధీమాగా అడిగాడు.

"బిస్కట్ల పొట్లం...ఏదీ చెల్లాయి?" అంటూ లోపలికి ప్రవేశించాడు.

"దొడ్లో వున్నది...పిలుచుకొస్తా" అని దిగి పరుగెత్తాడు.

"ఓ...రండి...బావగారూ..." సోమసుందరం తన బావమరదిని చూసి ఆహ్వానించాడు.

జానకిరామయ్య కుర్చీలో కూర్చున్నాడు. కాళ్ళు కడుక్కొని తుడుచుకుంటూండగా నాలుగేళ్ళ కూతురు నీలవచ్చి తండ్రివంక అదోమాదిరిగా చూసింది. జానకిరామయ్యకి దుఃఖం అకస్మాత్తుగా పొర్లుకొచ్చింది. ఆ తల్లిలేని పిల్లల్ని చూసేసరికి గుండె చెరువయింది.

"రా...అ...మ్మా" తువ్వాలుతో కళ్లు వత్తుకుంటూ దగ్గరకు తీసుకున్నాడు. బాధ అణచుకుంటూ, ప్రేమతో తల నిమిరాడు. బిస్కట్ల పొట్లం చేతిలో పెట్టాడు. తొడుక్కున్న గౌను చూశాడు. మాసిపోయింది. అక్కడక్కడ అతుకులు. చిట్టిగాడి చొక్కా లాగు కూడా అలాగే వున్నాయి. 'ఏం చేస్తున్నట్లు తను పంపుతున్న పైకం?' డబ్బు తర్కించుకున్నాడు.

"భోజనానికి లేవండి" సోమసుందరం పిలిచాడు.

"ఆఁ...వస్తున్నా" లేచాడు.

"పిల్లలు కులాసాగా వుంటున్నారు గదా?" అన్నం కలుపుకుంటూ అడిగాడు.

"ఆఁ. ఈమధ్య పిల్లకి మాత్రం రెండు రోజులు జ్వరమొచ్చి తగ్గిపోయింది."

"అదేఁవిటి? నాకు వ్రాయనేలేదే!" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఆఁ...ఏఁవుంది పెద్ద. మామూలు జ్వరమే. దగ్గర్లోనే వున్నదిగా ధర్మాసుపత్రి. డాక్టర్ మంచివాడు. నేనంటే అభిమానం" తన ఘనత చెప్తున్నాడు. "పోనీ నాలుగు డబ్బులు ఖర్చయితే అయ్యాయి. ప్రయివేటు డాక్టరు చేతనే మందిప్పించలేకపోయారా?" కొద్దిగా కోపం వచ్చినా పైకి కనపడనీయకుండా లేని నవ్వు తెచ్చుకుంటూ అడిగాడు. "హాఁ...డబ్బులకోసం లోభించాననుకుంటుండీ బావగారూ? ఏదో మామూలు జ్వరమేగదా అని చూపించలేదు." జానకిరామయ్యకి కష్టమేసింది సోమసుందరం మాటకి.

* * *

"నాన్నా నన్ను తీసికెళ్ళవూ?"

"ఎలా తీసుకెళ్ళను తండ్రీ? ఎవరున్నారు చెప్పు మిమ్మల్ని యింటిదగ్గిర చూసేందుకు నేను ఆఫీసుకెడితే?" ప్రక్కలో పడుకున్న కొడుకుని కౌగలించుకుంటూ అన్నాడు జానకిరామయ్య.

"నేను చెల్లాయిని చూస్తాగా?" అన్నాడు చిట్టి. నవ్వొచ్చింది జానకిరామయ్యకి.

"అది కాదురా నాన్నా... అన్నం, కాఫీ, నీళ్ళు, ఎవరు చూస్తారు?"

"అమ్మ వస్తుందటివిగా?"

జానకిరామయ్యకి గుండె తరుక్కుపోయింది. కళ్ళవెంట జటజట నీరుకారింది. వెనుకటి అనుభవాలు. కమలతో గడిపిన రాత్రులు...రెండేళ్ళ క్రితం వరకూ అనుభవించిన దాంపత్య సుఖం, జీవితం, అన్నీ క్షణంసేపు కళ్లోల పరచాయి అతని మనస్సుని.

"వస్తుంది...లే...నాన్నా...ఈమాటు తీసుకెడతాగా?" "ఎప్పుడూ అలాగే అంటావ్" నీల మారాం చేసింది.

"నాన్నా...మరేం...మామయ్య, అత్తయ్య, సినిమా కెడుతూ మమ్మల్ని తీసుకెళ్ళరు ఎప్పుడూ!"

మరో ఆటంబాంబు పేలినట్లయింది జానకి రామయ్యకి. "పోనీ వాళ్ళ విస్సాయిని, బుల్లెమ్మని, తీసుకెడతారా?"

"ఆ...మా యిద్దరినీ పడుకోమని, ప్రక్క భాగంలో వాళ్ళని చూస్తూ వుండమని వెడతారు నాన్నా" నీల చెప్పింది. ఒక్కసారి యిద్దరినీ గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. ఆ వేదన భరించలేక పోయాడు. తిరిగి కన్నీరు ప్రవహించింది. దిక్కులేని పక్షులవలె రెండేళ్ళనుంచి మాతృప్రేమకు, గారాబాలకు, ముద్దు మురిపెము లకు దూరమైన, ఆ పిల్లల్ని చూసేసరికి, మాటలు వినేసరికి గుండె తరుక్కుపోయింది.

"పదండి...ఇప్పుడెడదాం వస్తారా?" లేచాడు.

"ఓ..." యిద్దరూ గంతులేశారు. ఇద్దరినీ రెండో ఆట సినిమాకి తీసుకెళ్ళాడు. మొదలెట్టిన అరగంటకే యిద్దరూ నిద్రపోయారు. ఇంటర్వెల్ లోనే తిరిగి వచ్చేశాడు.

• • •

"వాడికి బట్టలు కొనలేదా మొన్న పండగకి?" మరునాడు ప్రొద్దున్న అడిగాడు.

"ఆఁ...ఏదీ...కొందా..మనే...అనుకున్నా" తడబడుతూ ఏదో తప్పు సమర్థిస్తూన్నట్లు అన్నాడు మెల్లగా సోమసుందరం.

దానికి కూడా కొనలేదా?" రెట్టించాడు స్వరం.

"ఏవో క్రిందటి పండగకి కొన్నవి వున్నాయి గదా అని" మళ్ళీ అదే ధోరణి.

"అవును బావగారూ ... పొద్దున్న పెట్టితే రాత్రి ఎందుకు అన్నం మళ్ళీ?" వుద్రేకం ఆపలేక పోయాడు. సోమసుందరం కళ్ళెర్రబడ్డాయి. తీవ్ర రూపం ధరించాడు.

"మీరు చాలా తొందరపడుతున్నారు. నాకు నా పిల్లలొకటీ, నా చెల్లెలి పిల్లలొకటి గాదు" గట్టిగా అన్నాడు.

"తెలుస్తూనే వున్నది. నెలానెలా పిల్లలకోసమని యాభైరూపాయలు పంపుతుంటే సరిగా బట్టలివ్వక, సినిమాలకు తీసుకెళ్ళక...మహాప్రేమతో చూస్తున్నారు..చాలు..చాలు..ఇహ మీ యింట్లో ఒక్క క్షణం వుండనక్కర్లేదు నాపిల్లలు..."

"తీసుకుపొండి. ఎవ్వరూ బ్రతిమాలడంలేదు. ఏమో తల్లిలేని పిల్లలు, మీకూ తల్లీ దండ్రీ తోబుట్టువులెవరూ లేరని, సానుభూతితో యింట్లో వుంచుకున్నానుగాని నాకెందుకొచ్చిందీ బెడద! తీసుకుపొండి మహాలాజులా!" అంటూ భార్య నుద్దేశించి "ఏయ్...వాళ్ళబట్టలిలా పారెయ్. ఆయన తీసుకెడతాడట పిల్లల్ని" అని కేకలేసి లోపలి కెళ్ళాడు. పక్షులు తిరిగి గూటికి చేరుకున్నాయి.

---

(35వ పేజీ తరువాయి)

ఎంతయినా అవసరం. మచ్చుకు నెమలి మరో నెమలిని గూర్చి అసూయపడుతున్నట్టు కనపడదు. ప్రతినెమలి తనపింఛమే ఎంతో గొప్పగా ఉన్నట్లు తృప్తిపడుతుంది.

ఈ పై విషయాలన్నీ సహృదయంతో అసిధారా భేదాన్ని గమనిస్తూ అర్థంచేసుకోవలసి ఉన్నది. లేకపోతే ఆత్మవిశ్వాసాన్ని గర్వంగాను నిస్పృహను వినయంగాను, తృప్తిని చేతగానితనంగాను విశాలదృష్టిని వేదాంతంగాను అన్వయించుకుండే ప్రమాదమున్నది.

వర్గరహిత సమాజంకోసం మనం చేసే పోరాటానికి అసూయ కొంత మూలంగా తోస్తుంది. అంచేత ఇప్పట్ల అసూయ కొంత నైతిక కిరణాల్లో పడుతుంది. మరో అంశం స్థిరపడిన వర్గాల్లో కాక కేవలం ఒకవర్గంలో వారిమధ్యనే అసూయ ఇంత వరకూ వ్యాపితం అయిఉన్నది. అంచేతనే ముష్టి వాడు తను వెళ్ళిన ఇంటికే వచ్చిన మరో ముష్టివాణ్ణి సహించడుకాని, ఇంటివారినిగూర్చి అసూయపట్టం లేదు! కాని ఇప్పుడు జరుగుతున్న పోరాటం, అసలు వర్గవ్యవస్థనే తుదముట్టించే పవిత్ర లక్ష్యశుద్ధితో సాగుతున్నది. ఇందులో తుచ్ఛమైన రూపంలో ఇప్పుడున్న అసూయకు కారణం: దారితెన్నూ తోచక మార్గాయాసం చెందినవాళ్లు, దీనికంతా ధ్యేయానికేసి నిదానంగా సంయమనంతో వెళ్ళే సోదర మానవులే కారణం అన్న తుచ్ఛమనస్తత్వంతో ఉండటమే!

ఆత్మశక్తి, ధ్యేయశుద్ధి, విశాలదృష్టి, సోదర మానవ ప్రేమ—ఈ నాల్గే మానవుడు మానవుడి మధ్య, జాతి జాతి మధ్య, దేశం దేశం మధ్య గల వైషమ్యాన్ని తగ్గించి జగత్కల్యాణానికి దారి తీయగలవు.

★